క్లుప్తంగా

శ్రీనివాసుడి కళ్యాణోత్సవం

మద్దికెర: స్థానిక నగిరేశ్వర ఆలయంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం ముందు గురువారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారు పద్మావతి సమేతుడై పెండ్లిపీటల మీద కొలుదీరారు. పురోహితుల మంత్రోచ్చరణల మధ్య వేదమంత్రాల సాక్షిగా శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

సొమ్ము రికవరీకి చర్యలు

తుగ్గలి: పక్కా ఇళ్ల నిర్మాణాల్లో దుర్వినియోగమైన సొమ్ము రికవరీకి ఆర్ఆర్ యాక్టు కింద రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. బొందిమడుగులలో గతంలో గ్రామైక్య సంఘాలను అడ్డుపెట్టుకొని కొందరు లబ్ధిదారులకు తెలియకుండానే వారి రేషన్ కార్డులతో పక్కా ఇళ్లు నిర్మించినట్లు నమోదు చేసి బిల్లులు స్వాహా చేశారు. గ్రామంలో మొత్తం 574 ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.1.46 కోట్లు దుర్వినియోగమైనట్లు కొన్నేళ్ల క్రితం విజిలెన్స్ విచారణలో తేల్చారు. దీంతో ఆర్ఆర్ యాక్టు కింద స్వాహా సొమ్ము రికవరీ చేయాలన్న ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం తహసీల్దార్ రవి తన సిబ్బందితో గ్రామానికి వెళ్లి రికవరీపై చర్చించారు. వీఆర్వోలు రామకృష్ణనాయక్, వెంకటరాముడు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ కుంటల పరిశీలన



కందనాతి వద్ద నీటి కుంటను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి, మసీదుపురం గ్రామాల్లో వాటర్‌షెడ్ కింద నిర్మించిన నీటి కుంటలను గురువారం అమృత సరోవర్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ నారాయణరెడ్డి బృందం పరిశీలించారు. వాటర్‌షెడ్ పథకం కింద ఏర్పాటు చేసిన నీటి కుంటల ప్రయోజనాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభం కావడంతో కుంటల్లో నీటిని నిల్వ చేసుకోవచ్చని సూచించారు. పీఓ వలిబేగ్, ఈసీ పురుషోత్తం రెడ్డి, కమిటీ చైర్మన్ బొడ్డన్న ఉన్నారు.

బీమా నమోదులో నిర్లక్ష్యం తగదు

కృష్ణగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వైఎస్సార్ బీమా రెన్యూవల్, నూతన నమోదులో నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ విశ్వమోహన్ అన్నారు. కృష్ణగిరిలో గురువారం ఆయన బీమా నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలవ్యాప్తంగా ఇప్పటివరకు 45 శాతం మాత్రమే సర్వే పూర్తయిందన్నారు. మండలంలో 14,262 మంది అర్హులు కాగా గతేడాది కంటే ఈ ఏడాది 3 వేలకుపైగా నూతన రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. గ్రామస్థాయిలో వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సమన్వయంతో నమోదు చేపట్టాలన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ



రాళ్లదొడ్డిలో ప్రతిష్ఠించిన వాల్మీకి విగ్రహం

ఎమ్మిగనూరురూరల్: రాళ్లదొడ్డి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా హోమపూజలు ఘనంగా నిర్వహించారు. బాలికలు కలశాలతో విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వాల్మీకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

కృష్ణగిరి: గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ విశ్వమోహన్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో వర్షాలు లేకపోవడంతో కూలీలకు పనులు కల్పించాలన్నారు. చేసిన పనులకు మస్టర్లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

త్వరలో ఆయిల్ ఇంజిన్ల పంపిణీ

ఆలూరు: హాలహర్వి, మాచనూరు, బాపురం గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం ద్వారా పొలాల్లో ఫామ్‌పాండ్స్, ఇంకుడు గుంతలు, డక్‌అవుట్లు ఏర్పాటు చేసుకున్న రైతులకు త్వరలో ఆయిల్ మోటార్ ఇంజిన్లు పంపిణీ చేస్తామని హాలహర్వి ఏఓ శివశంకర్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. రైతులకు ఉపయోగపడే విధంగా ఆధునిక వ్యవసాయ పరికరాలను మంజూరు చేస్తున్నామన్నారు. త్వరలోనే తేదీలను ప్రకటించి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీపీ నెట్టికంటమ్మ, జెడ్పీటీసీ లింగప్ప ఆధ్వర్యంలో రైతులకు పవర్ స్ప్రేయర్లు, ఆయిల్ మోటార్ ఇంజిన్లు పంపిణీ చేస్తామని, ఆయా పరికరాలు సిద్ధంగా ఉన్నాయని ఏఓ శివశంకర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన హెచ్‌జె.రంగన్న

పత్తికొండ రూరల్: స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తూ కొన్నేళ్ల కిందట పదవీ విరమణ పొందిన హెచ్‌జె.పెద్దరంగన్న గత కొన్ని నెలల నుంచి కనిపించడం లేదని భార్య సుజాత గురువారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేస్తున్నామని సీఐ మురళీ మోహన్ తెలిపారు.

అన్నదాతకు ఆర్బీకేల అండ

- రాయితీతో వ్యవసాయ యంత్రాలు, విత్తనాలు, ఎరువులు
- కియోస్క్ ద్వారా డిజిటల్ సేవలు
- గ్రామాల్లోనే సేవలందుతుండడంపై రైతుల హర్షం



వైఎస్సార్ యంత్ర సేవ కింద మంజూరైన ట్రాక్టర్‌ను అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, వ్యవసాయ అధికారులు (ఫైల్)

ఆలూరు మండలంలో ఆర్బీకే కేంద్రాలు	17
సేవలు పొందుతున్న రైతులు	15,392
ఈ ఏడాది రైతుల ఖాతాలో జమైన రైతు భరోసా	మొత్తం రూ.5.81 కోట్లు
మండలానికి కేటాయించిన వేరుశనగ విత్తనాలు	520 క్వింటాళ్లు
అందుబాటులో ఉన్న ఎరువులు	3,306 మెట్రిక్ టన్నులు
కస్టమర్ హైరింగ్ గ్రూపులు	17
వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా అందించిన ట్రాక్టర్లు	14
కౌలు రైతులకు అందించిన కార్డులు	56

ఆలూరు రూరల్: రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే మాటను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపెట్టింది. గ్రామంలోనే ఆర్బీకేల ద్వారా అందుతున్న సేవలు రైతన్నలకు వరంగా మారాయి. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పురుగు మందులు నాణ్యతతో ఎమ్మార్పీ ధరకే స్థానికంగానే అందుబాటులోకి వచ్చాయి.అలాగే సస్యరక్షణ చర్యలు, సాగు సూచనలు చేస్తూ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఆర్బీకేల ద్వారా గ్రామంలోనే సేవలందిస్తూ వ్యవసాయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పండుగలా మార్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి ముంగిటకే సేవలు

రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు ఎమ్మార్పీకే లభ్యమవుతున్నాయి. దీంతో రవాణా భారం, అధిక ధరల సమస్య తప్పింది. డిజిటల్ ఆధారిత సేవల కోసం కియోస్క్ మిషన్ అందుబాటులో వచ్చింది. ఈ-క్రాప్ బుకింగ్‌పై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తున్నారు. కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీ రుణాలు అందుతున్నాయి. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందుతోంది. పొలం బడి ద్వారా రైతుల పొలాల్లో శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పంటకోత ప్రయోగాలు, పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.



కమ్మరచేడులో సీహెచ్‌సీ గ్రూపులకు పవర్ స్ప్రేయర్లు అందిస్తున్న అధికారులు (ఫైల్)

జగనన్నకు రుణపడి ఉంటా



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందిస్తోంది. కౌలు రైతులకు అందించే పంట సాగుదారు హక్కు పత్రాన్ని అందుకున్నాను. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇస్తున్నారు. ఉచితంగా పంట బీమా నమోదు చేసుకున్నా. మా లాంటి కౌలు రైతులను కూడా ఆదుకుంటున్న జగనన్నకు రుణపడి ఉంటా.

– తిక్కన్న, రైతు, మొలగవల్లి గ్రామం

ట్రాక్టర్ కల నెరవేరింది



మా కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ) గ్రూపులో ఐదుగురు సభ్యులు ఉన్నాం. పేద రైతులం కావడంతో ట్రాక్టర్ కొనలేకపోయాం. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద మినీ ట్రాక్టర్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ట్రాక్టర్ విలువ రూ.6 లక్షలు కాగా కేవలం 10 శాతం రూ.60 వేలు కట్టి ట్రాక్టర్ అందుకున్నాం. దీంతో మా కల నెరవేరింది. 40 శాతం సబ్సిడీ కింద రూ.2.40 లక్షలు పోనూ మిగిలిన 50 శాతం రుణాన్ని కంతుల ప్రకారం చెల్లిస్తున్నాం. ఇది రైతు సంక్షేమాన్ని కోరే ప్రభుత్వం

– రఘు, సీహెచ్‌సీ గ్రూప్ సభ్యుడు, ఆలూరు

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్బీకేల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రాయితీ విత్తనాలు, ఎరువులు పురుగు మందులు ఆయా గ్రామాల ఆర్బీకేలలో అందుబాటులో ఉంచాం. రైతులకు సలహాలు సూచనలు అందించేందుకు అగ్రికల్చర్ అసిస్టెంట్లు అందుబాటులో ఉన్నారు. పంటల సాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా ఆర్బీకే సిబ్బందికి గాని మండల వ్యవసాయ అధికారిని గానీ సంప్రదించవచ్చు.

– వెంకటేశ్వర గౌడ్, ఏఓ, ఆలూరు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఆలూరు: ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. కరోనా, రాష్ట్ర విభజన కష్టాలు వెంటాడుతున్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని ప్రకటించడం హర్షణీయం. జీపీఎస్‌తో ఉద్యోగులకు మేలు కలుగుతుంది. కొన్ని ఉద్యోగ సంఘాలు పట్టుదలకు వెళ్లడం మంచిది కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో సీపీఎస్ కంటే మెరుగ్గా ఉన్నందున జీపీఎస్‌ను స్వాగతిస్తున్నాం. ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం ప్రకటించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. –బసవన్నగౌడ్,రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు, పత్తికొండ

జీపీఎస్‌ను స్వాగతిస్తున్నాం



ఆలూరు: ప్రభుత్వ ఉద్యోగులు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరడం న్యాయమైనదే. అయితే రాష్ట్ర విభజన తర్వాత ఆర్థికంగా వృద్ధి రేటు తగ్గింది. రెండేళ్ల పాటు దేశ, విదేశాలను గడగడలాడించిన కోరోనా మహమ్మారి నుంచి ఇప్పుడిప్పుడే రాష్ట్రం కోలుకుంటోంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర క్యాబినెట్ తీర్మానంలో ఉద్యోగులకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జీపీఎస్ విధానాన్ని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం.

–బాలకృష్ణ, ఏపీఎస్ఎన్‌జీవోస్ కార్యదర్శి, ఆలూరు

బాధ్యతల స్వీకరణ

పత్తికొండ టౌన్: పత్తికొండ తాలూకా సబ్‌డివిజన్ ట్రెజరీ అధికారిణిగా సి.ఉమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనంతపురం జిల్లా మడకశిర ట్రెజరీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం



పోనకలదిన్నెలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామ సర్పంచ్ పావని

నందవరం: గ్రామాలాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని గ్రామ సర్పంచ్ పావని అన్నారు. గురువారం పోనకలదిన్నె గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు సర్పంచ్, ఎంపీడీఓ దశరథరామయ్య భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో చౌడేశ్వరి దేవి ఆలయం నుంచి శ్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు, బీసీ కాలనీలో రెండు సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలని, పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పీఆర్ అధికారులకు సూచించారు. పీఆర్ ఏఈ జయన్న, ఎంపీటీసీ జైపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్‌లో సమస్యల ప్రస్తావన

తుగ్గలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అనుంరాజు ఆదెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, హౌసింగ్, వైద్యం, ఐసీడీఎస్, పశువైద్యం, ఉపాధి హామీ, తాగునీరు, వైఎస్సార్ క్రాంతి పథంపై ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా రాంపల్లి, జొన్నగిరి, రాతన సర్పంచ్‌లు మనీంద్ర, ఓబులేసు, రాచప్ప, ఎంపీటీసీ సభ్యులు రాజు, సుంకన్న తదితరులు గ్రామాల్లో శుద్ధజలం సరఫరా ఆగిపోయిందని వెంటనే సరఫరా చేయాలని, తుగ్గలి జగనన్న లేఅవుట్‌లో నీటి సమస్య తీర్చాలని, రుణాలు రెన్యూవల్ చేసే సమయంలో వన్‌బీలు లాక్ పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. ఇంటింటికీ కొళాయిలు ఎప్పుడు వేస్తారని ప్రశ్నించారు. జల్‌జీవన్‌మిషన్ పథకం కింద మండలానికి రూ.17.20 కోట్లు మంజూరయ్యాయని, సింగిల్ టెండర్ కావడంతో ఎవరూ ముందుకురావడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంతు చెప్పారు. రైతులు ఇబ్బందులు పడకుండా వన్‌బీలు మీ సేవ కేంద్రాల్లో వచ్చేలా చేస్తున్నామని తహసీల్దార్ రవి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టడం లేదని దీంతో సేవలు సరిగా అందడం లేదని సభ్యులు లేవనెత్తగా తమ పరిధిలోని కేంద్రాలను తనిఖీ చేస్తున్నామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అంబిక తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఆదెమ్మ సూచించారు. వైస్ ఎంపీపీ మల్లికార్జున రెడ్డి, ఎంపీడీఓ సావిత్రి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

హొళగుందలో గాలివాన బీభత్సం



హొళగుంద కుమ్మరి వీధిలో చేరిన వర్షపునీరు



హొళగుంద పీహెచ్‌సీ వద్ద రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన స్తంభం

హొళగుంద: మండలం కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. సుమారు గంట పాటు భారీ ఎత్తున వీచిన ఈదురుగాలులకు ప్రజలు భయందోళనకు గురయ్యారు. ఆదోని నుంచి మండలానికి సరఫరా అయ్యే 33 కేవీ మెయిన్ లైన్ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. హొళగుంద పీహెచ్‌సీ వద్ద విద్యుత్ స్తంభం రోడ్డుపై అడ్డంగా విరిగిపడడంతో కొద్ది సేపు రాకపోకలు నిలిచిపోయాయి. వైఎస్సార్ సీపీ నాయకులు పంపాపతి, సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున తదితరులు స్తంభాన్ని పక్కకు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. పలు గ్రామాల్లో షెడ్లు గాలికి ధ్వంసమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు రాత్రి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే హొళగుందలో కొర్చె వంక ఆక్రమణ కారణంగా వర్షపు నీరు పక్కనే ఉన్న కుమ్మరి వీధిలోకి చేరి వంకను తలపించింది. కిరాణి సిద్ధప్ప అనే వ్యాపారి ఇంటి గోడ కూలిపోయింది. గాలి అధికంగా ఉండడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడి ఇంట్లోనే ఉండిపోయారు.

అంబులెన్స్‌లో ప్రసవం



శిశువును చూపుతున్న ఈఎంటీ వీరేష్

ఆస్పరి: అంబులెన్స్‌లో వాహనంలో గర్భిణి ప్రసవించింది. మండలంలోని బిణిగేరి గ్రామానికి చెందిన గర్భిణి జయంతికి పురిటి నొప్పులు రావడంతో గ్రామ ఆశా కార్యకర్త ఈరమ్మ 108 సిబ్బందికి సమాచారం ఇచ్చింది. వెంటనే ఈఎంటీ వీరేష్, పైలెట్ మల్లికార్జున బిణిగేరికి వాహనాన్ని తీసుకెళ్లి గర్భిణిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ, బిడ్డను ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించినట్లు ఈఎంటీ వీరేష్ తెలిపారు. జయంతికి ఇది రెండో కాన్పు.

హెబ్బటం మీదుగా బస్సులు నడపాలి

హొళగుంద: హొళగుందకు వయా ఎల్లార్తి మీదుగా గాకుండా హెబ్బటం మీదుగా ఆర్టీసీ బస్సులు నడపాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదోని ఆర్టీసీ డీఎం మహమ్మద్ షఫిని కోరారు. ఈ మేరకు గురువారం హొళగుందకు రూట్ సర్వే కోసం వచ్చిన ఆయనను సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున, ఎంపీటీసీ మల్లికార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు కోగిలతోట శేషప్ప, పంపాపతి, ఎస్కే గిరి తదితరులు కలిసి సమస్యను వివరించారు. ఎల్లార్తి మీదుగా హొళగుందకు బస్సులు తిప్పడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రస్తుతం రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారని, 12 నుంచి పాఠశాలలు తెరుచుకుంటున్న నేపథ్యంలో హెబ్బటం మీదుగా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. విషయాన్ని మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లి డీఎంతో మాట్లాడించగా హెబ్బటం మీదుగా బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

నేడు వెల్దుర్తికి ఎమ్మెల్యే రాక

వెల్దుర్తి: ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం మండల కేంద్రానికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎమ్మెల్యే స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు.

11న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

నందవరం: ముగతి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు ఈ నెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్లను http://apms.ap.gov.in వైబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. మోడల్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

సచివాలయాల తనిఖీ

పత్తికొండ టౌన్: నూతన ఎంపీడీఓ కవిత గురువారం మండల కేంద్రంలోని సచివాలయాలను తనిఖీ చేశారు. పత్తికొండ- 4, 5, 6 సచివాలయాల తనిఖీలో భాగంగా ఉద్యోగుల హాజరు, మూమెంట్ రిజిస్టరు పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 10వ తేదీలోపు వైఎస్సార్ బీమా నమోదు పూర్తి చేయాలని, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

వెల్దుర్తి: ఏపీ ఎమ్మార్పీఎస్ సూదేపల్లె గ్రామ కమిటీ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. గ్రామంలో సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు నవీన్ మాదిగ, రామగిడ్డయ్య ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడిగా బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా రామాంజనేయులు, సెక్రటరీగా నాగరాజు, జాయింట్ సెక్రటరీగా తిమ్మరాజు, మరో 20 మంది ఎన్నికయ్యారు. దళితుల ఉద్ధరణకు, గ్రామాభివృద్ధికి పోరాడాలని జిల్లా నాయకులు కమిటీ ప్రతినిధులకు సూచించారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట గ్రామానికి చెందిన ఇద్దరు సారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం సెబ్, వెల్దుర్తి పోలీసులు కలిసి గ్రామంలో నిర్వహించిన సోదాల్లో సారా విక్రయిస్తున్న మద్దిలేటి, నాగేంద్రను గుర్తించి వారి వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

నిబంధనలు పాటించాలి

గోనెగండ్ల: ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లు ప్రభుత్వ నిబంధనల మేరకే విక్రయాలు చేపట్టాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ హేమలత ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ డీలర్లు, దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విత్తన చట్టం ప్రకారం క్రయవిక్రయాలు జరుపుకోవాలన్నారు. లైసెన్స్‌లో గోడౌన్‌లు ఇన్‌క్లూజన్ చేసుకోవాలని, ప్రతి విత్తన లాట్‌కు ఇన్వాయిస్ తప్పకుండా ఉండాలన్నారు. విత్తనాలను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతి రోజు స్టాకు బోర్డు, ధరల పట్టిక నమోదు చేయాలన్నారు.ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెనూ తప్పనిసరి

ఆస్పరి: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆలూరు సీడీపీఓ నిర్మలాదేవి సూచించారు. గురువారం ఆస్పరిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్ల సమాశం నిర్వహించారు సీడీపీఓ మాట్లాడుతూ.. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలను అరికట్టాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సూపర్ వైజర్లు శివలింగమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తాం



కేవీపీఎస్ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దారు విష్ణుప్రసాద్

పత్తికొండ రూరల్: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తామని తహసీల్దారు విష్ణుప్రసాద్ హెచ్చరించారు. పత్తికొండలో సర్వే నంబర్ 95లో ఎకరం ప్రభుత్వ వంక పోరంబోకు స్థలాన్ని కొందరు ఆక్రమించి బండలు పాతారు. విషయం తెలుసుకుని తహసీల్దారు ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం జేసీబీతో ఆక్రమిత స్థలంలో బండలు తొలగించి చదును చేయించారు. దీన్ని వ్యతిరేకిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట దళితులు ఆందోళన చేపట్టి తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు విష్ణుప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేస్తామని హెచ్చరించారు. కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ కడగొమ్ము వంక పొడవునా నాయీ బ్రాహ్మణ కాలనీలో అక్రమ కట్టడాలను తొలగించాలని విన్నవించారు. రీసర్వేలో ఆక్రమణలన్నీ తొలగిస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



హొళగుంద జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ ఆదినారాయణ

ఆలూరు: జగనన్న కాలనీలలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేసేలా ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కృషి చేయాలని ఆలూరు హౌసింగ్ డీఈ ఆదినారాయణ ఆదేశించారు. గురువారం హొళగుంద జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆలూరు మండలంలో 14 లేఅవుట్లలో 842 గృహాలు మంజూరుకాగా ఇప్పటి వరకు 159 గృహాలు పూర్తయినట్లు తెలిపారు. 419 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందన్నారు. ఆస్పరి మండలంలో 16 లేఅవుట్లలో 815 గృహాలు మంజూరుకాగా 219 గృహాలు పూర్తయ్యాయని 275 ఇళ్లు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. దేవనకొండ మండలంలో 1189 గృహాలకు గాను 565, చిప్పగిరి మండలంలో 735 ఇళ్లకుగాను 161 పూర్తయ్యాయని డీఈ వివరించారు. అలాగే హాలహర్వి మండలంలో 14 లేఅవుట్లలో 832 ఇళ్లకు గాను 152 పూర్తయ్యాయని, హొళగుంద మండలంలో 722 గృహాలకుగాను 181 పూర్తికాగా, 162 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయించేలా కృషి చేయాలని ఏఈలకు సూచించారు.

చిప్పగిరి: పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీలలో చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ సీవీ కొండయ్య ఆదేశించారు. ఆయన గురువారం మండలంలోని రామదుర్గం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈఓపీఆర్డీ సంజన్న, పంచాయతీ కార్యదర్శి సిసింద్రి తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో రీసర్వే పూర్తి

ఆస్పరి: మండలంలోని శంకరబండ, తరువగల్లు గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం కింద రీసర్వే పూర్తైనట్లు తహసీల్దార్ కుమారస్వామి గురువారం తెలిపారు. శంకరబండలో 289 మంది రైతులకు సంబంధించి 1400 ఎకరాలు, తరువగల్లులో 345 మంది రైతులకు సంబంధించి 1100 ఎకరాల్లో రీ సర్వే చేసి హద్దు రాళ్లను నాటించామన్నారు. తురువగల్లులో మాత్రం 20 సర్వే నంబర్లకు సంబంధించి సమస్యాత్మకంగా ఉండడం వల్ల సర్వే చేయలేదన్నారు. మండలంలో రీ సర్వేకు రైతులకు సహకరించాలని కోరారు. సమగ్ర భూ సర్వే ద్వారా భూవివాదాలు తొలగిపోతాయన్నారు. మండలంలో 1.60 లక్షల భూమిని సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 2500 ఎకరాల్లో మాత్రమే రీ సర్వే జరిగిందన్నారు. త్వరలోనే మిగతా గ్రామాల్లో రీసర్వే చేపడతామని తహసీల్దార్ చెప్పారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

ఆలూరు: పొదుపు సంఘాల సభ్యులు వివిధ యూనిట్ల స్థాపన కోసం పొందిన రుణాలకు సంబంధించి కంతులను బ్యాంకులకు సకాలంలో చెల్లించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో-ఆర్డినేటర్ నవీన్ సూచించారు. ఆయన గురువారం స్థానిక ఏసీ కార్యాలయంలో వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన పొదుపు మహిళలతో సమావేశమయ్యారు. మండలంలో 2500 గ్రూపులు క్రియాశీలకంగా ఉన్నాయన్నారు. వైఎస్సార్ ఆసారా పథకం కింద దాదాపు రూ.12 కోట్లు మహిళల ఖాతాలోకి జమ చేసినట్లు చెప్పారు. గేదెలు, ఆవులు, బర్రెలు కొనుగోలు చేసిన వారు, వివిధ యూనిట్లు స్థాపించుకున్న లబ్ధిదారులు రుణాలను చెల్లిస్తే ఇతరులకు అవకాశం కల్పిస్తామని నవీన్ తెలిపారు. ఏపీఎం ఆంజనేయులు, సీసీలు మహిళలు, లీడర్లు, ఎంబీకేలు ఉన్నారు.

నిందితుల అరెస్ట్

వెల్దుర్తి: రామళ్లకోట గ్రామంలో ప్రేమ పేరుతో బాలికను ఈనెల 4న రాత్రి కిడ్నాప్ చేసిన మధును గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. బాలిక తండ్రి ఈనెల 6న చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ మేరకు గురువారం నిందితుడితో పాటు అతడికి సహకరించిన రామళ్లకోట సుశీల, కుమార్‌తోపాటు కృష్ణగిరి మండలానికి చెందిన సురేంద్ర, సుధాకర్, మధును హైవే-44పై చెరుకులపాడు క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేశారు. వారిని డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్ పంపారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

స్కూళ్లకు జేవీకే కిట్లు

తుగ్గలి: జగనన్న విద్యా కానుక కిట్లను తుగ్గలి ఎమ్మార్సీ నుంచి గురువారం మండలంలోని పాఠశాలలకు తరలించారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ రామ వెంకటేశ్వర్లు కిట్ల నాణ్యతను పరిశీలించి పంపారు.

ఎమ్మిగనూరులో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీ నగర్‌లో చోరీ జరిగింది. స్థానికంగా నివాసముంటున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో చెన్నైకు టూర్ వెళ్లారు. గమనించిన దొంగలు బుధవారం అర్ధరాత్రి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం వాటర్ క్యాన్ డెలివరీ బాయ్ ఇంటి తలుపు పగటగొట్టి ఉండటం చూసి వెంటనే కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించాడు. ఈ మేరకు ఇంటి యజమాని సమీపంలోని తమ బంధువులకు విషయం చెప్పడంతో వారు ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు ఎల్ఈడీ టీవీలు, బీరువాలోని ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. క్రైంపార్టీ ఏఎస్ఐ విజయ్‌కుమార్, పీసీ ఉసేనిలు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కర్నూల్ నుంచి క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ మధుసూదనరావు తెలిపారు. ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇస్తే ఇంటిపై నిఘా ఉంచుతామన్నారు.